శ్రీ అరబిందో

(సచిత్ర కథ)

శ్రీ అరబిందో

(సచిత్ర కథ)

కథ కూర్పు (ఆంగ్లం) : డా॥ ప్రేమానందకుమార్
తెలుగు అనువాదం : ఎ. నరేష్
చిత్రాలు : సునితావాసు

రామకృష్ణ మఠం
దోమలగూడ, హైదరాబాదు 500 029



తూర్పు బెంగాల్ రాష్ట్రంలో రంగపూర్ పేరుగాంచిన పట్టణం. ఈ తూర్పు బెంగాల్ రాష్ట్రమే ఇప్పుడు బంగ్లాదేశ్‌గా ఏర్పడింది. అక్కడ కృష్ణధన్ ఘోష్ అనే పేరుగల వైద్యుడు నివసించేవాడు. దయార్ద్రహృదయుడైన కృష్ణధన్ పేదలకు ఎంతగానో సహాయపడేవాడు.
ఆయన ధర్మపత్ని స్వర్ణలత. వారికి బినోయ్ భూషణ్, మనోమోహన్ అనే ఇద్దరు కుమారులున్నారు.
1872 ఆగష్టు 15న వారికి మరొక మగబిడ్డ జన్మించాడు. వారు అతడికి 'అరబిందో', అంటే కమలం అని నామకరణం చేశారు.
అరబిందో ఎంతో క్రమశిక్షణ గల విద్యార్థి. కష్టపడి చదివే మనస్తత్వంతో పాటు అతడికి మంచి హాస్యస్ఫూర్తి కూడా ఉండేది.
ఒకరోజు అరబిందో తన మామయ్యతో కలసి అద్దం ముందు నిలబడ్డాడు.
"ఇదిగో చూడు! ఇందులో చిన్న కోతి ఉంది!"
"పెద్ద మామ! పెద్ద కోతి!"
ఐదు సంవత్సరాల వయస్సులో అరబిందోను డార్జిలింగ్‌లోని లోరెట్టో కాన్వెంటులో చేర్పించారు.

మృదుమధురస్వభావుడైన అరబిందో అనతికాలంలోనే అనేకమంది స్నేహితుల్ని కలుపుకున్నాడు. తన పాఠశాలలోని మిగిలిన విద్యార్థులతోపాటు అరబిందో ఆంగ్లభాషలో చక్కగా, ధారాళంగా మాట్లాడేశక్తిని సాధించాడు.

డార్జిలింగ్‌లోని హిమాలయాల సౌందర్యం అతడిలోని కవిని మేల్కొల్పింది.

కృష్ణధన్ తన ముగ్గురు కుమారులనూ, కుమార్తె సరోజనినీ 1879లో ఇంగ్లండుకు తీసుకువెళ్ళి మాంఛెస్టర్‌లోని గౌరవనీయులైన డ్రివెట్ సంరక్షణలో ఉంచి భారతదేశానికి తిరిగివచ్చాడు. అక్కడ ఐదు ఏళ్ళపాటు డ్రివెట్ వ్యక్తిగత పర్యవేక్షణలో వారికి విద్యాభ్యాసం జరిగింది. ఆ తర్వాత అరబిందోను 1884లో లండన్‌లోని సెయింట్ పాల్ పాఠశాలలో చేర్పించారు.



అతడు ఆ పాఠశాలలో అసాధారణ ప్రతిభను చూపి సాహిత్యంలో బటర్‌వర్త్ ద్వితీయ బహుమతిని గెలుచుకున్నాడు. సాహిత్యం మాత్రమే కాక, అతడు చరిత్ర పాఠాలలో గొప్ప ప్రతిభ చూపేవాడు. త్వరలోనే ఆంగ్లం, ఫ్రెంచి, ఇటాలియన్, జర్మన్ సాహిత్యాల మీద పట్టు సాధించాడు. వారి తండ్రి సరిపడ డబ్బు పంపలేక పోవడం వల్ల ఆ సహోదరులందరూ ఉన్న కొద్ది డబ్బుతోనే గడుపుతూ, అర్థాకలితో పడుకోవలసి వచ్చేది. నెలల తరబడి వారికి తగిన ఆహారం దొరికేది కాదు.

యౌవనంలోకి అడుగుపెడుతున్న అరబిందో మనస్సు ఇప్పుడు భారతదేశంవైపు మరలింది.



దీనికి సమాధానం తెలుసుకోవడానికి 'కమలము-కత్తి' (లోటస్ అండ్ డాగర్) అనే సంస్థలో చేరాడు.



ఆ సంస్థలోని ప్రతి సభ్యుడు "భారతదేశానికి బ్రిటీషుపాలన నుంచి విముక్తి కలిగించడానికి పనిచేస్తాను!" అని శపథం చేసారు. అరబిందో కేంబ్రిడ్జిలోని "ఇండియన్ మజ్లిస్" అనే సంస్థలో కూడా ఉపన్యాసాలు ఇచ్చాడు.
అక్కడి వారికి ఇలా ఉద్బోధించాడు:
"నేడు భారతదేశంలో ఒక సంపూర్ణమైన విప్లవం రావాలి! అదితప్ప ఏది సాధించినా, ఏమీ ప్రయోజనం ఉండదు!"
అదృష్టవశాత్తూ, కింగ్స్ కాలేజీ, కేంబ్రిడ్జిలో అరబిందోకు ఎనభై పౌండ్ల ఉపకారవేతనం లభించింది. దీని సహాయంతో అతడు ఆనర్సు పరీక్ష మొదటి సంవత్సరం పూర్తి చేశాడు.
ఈ సమయంలో అతడు గ్రీకు, లాటిన్ భాషలమీద మంచి పట్టు సాధించాడు. పంతొమ్మిదేళ్ళు నిండకుండానే గొప్ప పండితుడని పేరు తెచ్చుకున్నాడు.
అప్పుడు ఇండియన్ సివిల్ సర్వీస్ పరీక్షకు హాజరయ్యాడు. ఆ పరీక్షలో ఉత్తీర్ణుడయినప్పటికీ ఆ ఉద్యోగంలో చేరకూడదని తీర్మానించుకున్నాడు.
ఎందుకంటే, బ్రిటీషు ప్రభుత్వం తన మాతృభూమిని ఎన్ని విధాలుగా అణచివేసి, దోచుకుంటోందో అతడికి అప్పటికే స్పష్టంగా అర్థమయింది. కొంతకాలం తరువాత, బరోడా మహారాజు అతడి ప్రతిభను గుర్తించి బరోడా సంస్థానంలో కలెక్టరుగా నియమించాడు.


జన్మతః కవి అయిన అరబిందో పాశ్చాత్యం నుంచి ప్రాచ్యానికి తన తిరుగుపయనాన్ని సరస్వతీ దేవి కృపగా ఒక కవితలో అభివర్ణించాడు.
"కమల స్వర్గము నుండి పిలిచె పలుకులబోణి హిమగిరుల ఘన సీమ వెలయుచుండెడు ధరణి, అమల గంగా తటిన విరియు పూదోటకూ రమముతో సంద్రమున గంగ కలిసెడు భువికి"
భారతదేశానికి చేరుకోగానే, "అపారమైన ప్రశాంతత నన్ను ఆవహించింది!" అని అతడు పలికాడు. దురదృష్టవశాత్తు అరబిందో తన తండ్రిని చూడలేకపోయాడు. అంతకు కొద్దిరోజుల ముందే ఆయన పరమపదించారు.
అయితే అతడి మనస్సు దేశభక్తి భావాలతో పొంగిపొర్లుతుండడంతో అరబిందో బరోడాకు వెళ్ళి అక్కడ ఉద్యోగంలో చేరాడు. అక్కడ అరబిందో 13 సంవత్సరాల పాటు పనిచేశాడు. ఈ సమయంలో అతడు బెంగాలీ, గుజరాతీ, సంస్కృత భాషల మీద పాండిత్యం సాధించాడు.
భారత పురాణాలలోని మహోన్నతులైన స్త్రీపురుషుల కథలను చదవడం అతడికి ఎంతో ఇష్టం.
పిదప, అతడు బరోడాలోని మహారాజ కళాశాలలో బోధన ప్రారంభించాడు. తీరిక సమయంలో వ్యాసుడు, వాల్మీకి, కాళిదాసు వంటి గొప్ప కవుల రచనలను చదువసాగాడు.



వాటితో పొందిన స్ఫూర్తితో తాను కూడా కవిత్వం వ్రాయడం ప్రారంభించడంతో పాటు, "ఇందు ప్రకాశ్" అనే పత్రిక ద్వారా అనేక వ్యాసాలను ప్రచురించాడు.
మృణాళినీ దేవిని 1901లో వివాహం చేసుకున్నాడు.
ఆమె మంచి వ్యక్తిత్వం గల పతివ్రత. అంతేకాక ఆమె శ్రీరామకృష్ణ పరమహంసకూ, శ్రీశారదాదేవికీ భక్తురాలు కూడా.
కొద్దికాలం తర్వాత శ్రీ విష్ణుభాస్కర్ లేలే అనే గురువు దగ్గర 'యోగ' నేర్చుకోవాలని అరబిందో నిశ్చయించుకున్నాడు. వాళ్ళు మొదటిసారి ఎదురెదురుగా కూర్చున్నప్పుడు గురువు శిష్యుడితో అన్నారు.
"నీ దృఢమైన సంకల్పశక్తితో అనవసరమైన ఆలోచనలన్నింటినీ అవతల పారవెయ్యి!"
ఇటువంటి కష్టసాధ్యమైన స్థితిని అరబిందో మూడు రోజులలోనే సాధించగలిగాడు. దీనివల్ల అతడి మనస్సు అనిర్వచనీయమైన, అసమానమైన ప్రశాంతతతోనూ, నిశ్శబ్దంతోనూ నిండిపోయింది.
ఈ మానసిక స్థితి అతడి జీవితమంతా కొనసాగింది. తన జీవిత పర్యంతం అరబిందో ఈ యోగసాధనను కొనసాగించాడు.

భారతదేశపు సాంస్కృతిక పునరుజ్జీవనంలో 1893వ సంవత్సరం చెప్పుకో దగినది. ఈ సంవత్సరంలోనే అరబిందో 'భారతదేశపు పునరుత్థానం' అనే తన జీవితపు మహత్కార్యానికి శ్రీకారం చుడితే, ఇదే సంవత్సరంలో స్వామి వివేకానంద అమెరికాలోని చికాగోనగరంలో తన చారిత్రాత్మకమైన ఉపన్యాసాన్ని ఇచ్చారు.
హిందూమతపు సంరక్షకుడిగానూ, సనాతన ధర్మపు నిజప్రతినిధిగానూ, వార్తాపత్రికలన్నీ స్వామి వివేకానందని వేనోళ్ళ కొనియాడాయి.
ఆయనకు సంబంధించిన వార్తలన్నీ ప్రపంచమంతటా, అన్ని పత్రికలలోనూ, ప్రముఖంగా ప్రచురితమయ్యాయి. అరబిందో ఆ వార్తలను ఎంతో ఉత్సాహంతో, ఆనందంతో చదివాడు.
స్వామి వివేకానంద ఇలా పిలుపునిచ్చారు...
"భారతదేశానికి గొప్ప చరిత్ర ఉంది. అది మరలా అటువంటి గొప్ప స్థితిని చేరుకోబోతోంది. అయితే, భారతీయులమైన మనం, మన సోమరితనాన్నీ, బానిస బుద్ధిని వదిలిపెట్టాలి!"
భారతదేశానికి తిరిగివచ్చిన స్వామి వివేకానందకి దేశంలోని అన్ని ప్రాంతాలలోనూ బ్రహ్మాండమైన స్వాగతం లభించింది.
1897 మే 1న ఆయన రామకృష్ణ మిషన్‌ను స్థాపించారు. ఈ ఆనందకరమైన సంఘటనలన్నీ భారతదేశపు భవిష్యత్తు ఎంతో ఉజ్జ్వలంగా ఉండబోతోందన్న నమ్మకాన్ని అరబిందో హృదయంలో కలిగించాయి.

ఇక అరబిందో తన శాస్త్రాధ్యయనాన్ని కొనసాగించాడు. దానివలన మన సాంస్కృతిక వారసత్వంలో గొప్పతనం, శ్రీరాముడు, కృష్ణుడు, అర్జునుడు మొదలైన వీరుల ఉదాత్తమైన వ్యక్తిత్వం అతడికి మరింతగా అర్థమయ్యాయి.
దానికి తోడు స్వామి వివేకానంద, బాలగంగాధర్ తిలక్, లాలా లజపతిరాయ్ వంటి దేశభక్తులు జాతిని మేల్కొల్పడానికి చేస్తున్న ప్రయత్నాలను అతడు నిశితంగా గమనించసాగాడు.
ఆ రోజులలో, బ్రిటీషు ప్రభుత్వం చేస్తున్న దారుణమైన అక్రమాలు అరబిందోను భారతదేశ విముక్తికోసం తనవంతు ప్రయత్నాన్ని చేయడానికి పురికొల్పాయి.
లార్డ్ కర్జన్ 1905లో బెంగాల్‌ను విభజించాడు. దేశాన్ని ముక్కలు చేసే ఈ బ్రిటీష్ పద్ధతులకు భారతదేశం నలుమూలల నుంచీ వ్యతిరేకత ఎదురైంది.
బంకించంద్ర ఛటర్జీ వ్రాసిన 'వందేమాతరం' అనే గేయం నుంచి స్ఫూర్తిని పొంది, 'వందేమాతరం' అనే వాక్యాన్ని నినాదంగా చేపట్టి భారతదేశంలోని ప్రజలందరూ ఐకమత్యంతో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించారు.
అరబిందో ఈ వందేమాతర నినాదాన్ని 'దేశభక్తి మంత్రం'గా అభివర్ణించాడు.

ఈ వందేమాతర గీతంలో భారతదేశాన్ని "సజీవమాతృ మూర్తి"గా బంకించంద్ర అభివర్ణించాడు. అరబిందోకు కూడా ఇదే అభిప్రాయం ఉంది. తాను వ్రాసిన 'భవాని భారతి'లో అతడు ఇవే భావాలను వ్యక్తపరచాడు.
జన్మభూమిలో జీవించడం ఎంత ఆనందకరంగా ఉంటుందో ఈ కవితలో హృద్యంగా చిత్రించాడు.
ఒకనాటి రాత్రి అరబిందోకు తన ఛాతీమీద ఒక భయంకరమైన చెయ్యి తాకుతున్న అనుభూతి కలిగింది.
మేల్కొని చూస్తే ఎదురుగా పుర్రెలమాలతో కాళికాదేవి నిలబడి ఉంది. అరబిందో భయపడిపోయాడు.
"ఎవరు నువ్వు?"
"కుమారా! నేను భారతీయుల తల్లిని! ఆద్యంతరహితమైన ఈ ప్రజావళి దేవతల సంతానం. విధి, కాలం, మరణం - ఇవేవీ వారిని అంతమొందించలేవు!"
"పుత్రా! అబ్రహాం సంతానం (యూదులు, క్రైస్తవులు, మహమ్మదీయులు) భగవంతుణ్ణి నిరాకారుడిగా కొలుస్తారు. కానీ మీరు భగవంతుణ్ణి మూడు రూపాలలో అర్చిస్తారు.
మీరందరూ నా బిడ్డలు. నీ నిద్రమత్తును వదిలించుకో. నీ జన్మభూమి విముక్తి కోసం పోరాడు!"


ఆ అనుభూతి సమయంలో, కాళికాదేవి చూపిన కొన్ని దృశ్యాలలో భారతీయులు విదేశీ శక్తులను పారద్రోలుతున్నట్టుగా కనిపించింది.
చివరకు భయంకరమైన ఆ కాళీరూపం సౌమ్యత ఉట్టిపడే సుందరమైన సావిత్రీదేవిగా రూపొందింది.
కాళికామాత మరొక దృశ్యాన్ని కూడా ఆయనకు చూపింది. అందులో భవిష్యత్ భారతదేశం గొప్ప సంపదలతో తులతూగుతూ, వేదసంస్కృతి నలుదిశలా వర్ధిల్లుతున్నట్టు కనిపించింది.
ఈ అనుభూతి తర్వాత అరబిందో రాజకీయాలలోకి ప్రవేశించారు. తన ఉద్యోగాన్ని వదిలివేయటంతోపాటు, తన యోగాభ్యాసాన్ని కూడా విడిచిపెట్టారు.
రాజకీయపోరాటాన్ని ఉద్ధృతం చేయాలన్న దృఢసంకల్పంతో ఆయన ఈ విధమైన చర్యలు చేపట్టారు. కానీ సుఖమయమైన సంసారజీవితానికి ఇవి సరిపడవు కదా!

అరబిందో తన భార్యను ఓదారుస్తూ ఇలా వ్రాశారు:
ఇప్పుడు నాకు మూడు విషయాలు పిచ్చిలాగా పట్టుకున్నాయి. మొదటిది: "నా వివాహం, నా సంపదలు, నా జీవితం - నా శారీరిక సుఖాల కోసం, నా వ్యక్తిగతమైన సుఖసంతోషాల కోసం మాత్రమే" అని నేను కనుక భావిస్తే నేనొక దొంగగానే జమకట్టబడతానని నాకు అనిపిస్తోంది.
రెండవది: నాకు దేవుణ్ణి ముఖాముఖీ చూడాలన్న కోరిక కలుగుతోంది. దీనికోసం ఏ త్యాగానికైనా నేను సిద్ధంగా ఉన్నాను.
మూడవది: భారతదేశమంటే కేవలం మైదానాలూ, అరణ్యాలూ కాక భౌతిక, ఆధ్యాత్మిక సంపదలతో అలరారే ఒక సజీవ దేవతగా, నా తల్లిగా, నాకు కనిపిస్తోంది.
ఒక విదేశీ రాక్షసుడు నా తల్లిని చిత్రహింసలు పెడుతూ, ఆమె రక్తం పీలుస్తున్నాడు. ఇటువంటి విపత్కర పరిస్థితులలో నా తల్లికి విముక్తి కలిగించడం నా బాధ్యత కాదా?"
ఆయన ఇలా భావించారు: "భారతదేశాన్ని పునరుద్ధరించగలిగే శక్తి నాకు ఉంది. ఆ విశ్వాసం ఎంతో విస్పష్టంగా నాలో పెరుగుతోంది.

ఈ విదేశీరాక్షసుడితో పోరాటానికి నేను కత్తి పట్టబోవడం లేదు, తుపాకీ ఎక్కుపెట్టబోవడం లేదు కానీ 'కలం'శక్తితో పోరాడబోతున్నాను!"
"వందేమాతరం" పత్రికలలో విదేశీపాలకుల అణచివేతను వివరిస్తూ అరబిందో వ్యాసాలు వ్రాయసాగారు.
BANDEMATARAM
MATARAM
ధీరోదాత్తమైన ఆయన రచనాశైలి, స్పష్టమైన భావాలు వేలమంది పాఠకులను ఆకర్షించాయి.
BANDE MATARAM
BANDEMATARAM
భాగవతంలోని కంసుడి పాలనతో బ్రిటీష్ పాలనను పోల్చి అరబిందో వ్యాసాలు వ్రాశారు. శ్రీకృష్ణుడి పాలనను దేశస్వాతంత్ర్యంతో పోల్చారు.
గుజరాత్, బెంగాల్, మహారాష్ట్రలలో విస్తృతంగా పర్యటించి, ఆయన చేసిన ఉపన్యాసాలకు వేలకొద్దీ శ్రోతలు గుమిగూడారు. విద్యాధికులైన భారతీయులు మరింతగా స్వాతంత్ర్యోద్యమంలో చేరడం చూసి బ్రిటీష్ పాలకులు గజగజలాడారు.


ఆయన ప్రచారానికి అడ్డుకట్ట వేయడానికి ఆయన మీద తప్పుడు కేసును మోపారు. బాంబులు తయారు చేస్తున్నాడనే నింద మోపి ఆయనను జైలులో పెట్టారు.
కలకత్తాలోని అలీపూర్ న్యాయస్థానంలో విచారణ జరిగింది.
అరబిందో ఈ విచారణకు ఏ మాత్రం భయపడలేదు. తనకు ప్రత్యేకించిన జైలుగదిలో ధ్యానం చేస్తూ, భగవద్గీత చదువుతూ కాలం గడిపారు.
రకరకాల నేరాలు చేసి తనతోపాటు జైలులో మగ్గుతున్న తోటిఖైదీల దుస్థితిని చూసి ఎంతో విచారించారు. ఈ జైలు జీవితం ఆయనలో గొప్ప పరివర్తనను తెచ్చింది, ఆయననొక ఋషిగా తయారుచేసింది.
తనలోతాను, "ఈ జైలులోనుండి బయటపడిన తర్వాత ఏ ఒక్కరూ బాధలలో పడకుండా చూస్తాను. మొత్తం మానవాళి అభ్యున్నతి కోసం ప్రయత్నిస్తాను!" అని అరబిందో అనుకున్నారు. అప్పటివరకూ ఆయన సాధించిన విజయాలను కొనియాడుతూ స్వామి వివేకానంద ఆయనకు దర్శనమిచ్చారు.
ఆ అద్భుతదర్శనం పదిహేను రోజులపాటు సాగింది.


ఈ కాలంలోనే ఆయనకు మరొక దివ్యదర్శనం కలిగింది. తన చుట్టూ ఉన్న ప్రతి వస్తువులోనూ ఆయనకు 'వాసుదేవుడు' (శ్రీకృష్ణుడు) కనిపించసాగాడు. దాన్ని గురించి చెబుతూ, "నా జైలుగది ముందున్న చెట్టు దగ్గరికి నడిస్తే,
వాసుదేవుడే ఆ చెట్టురూపంలో నాకు నీడ ఇస్తున్నట్టు కనిపించింది. నన్ను బయటకు పోకుండా నిర్బంధిస్తున్న జైలు ఊచలలో నాకు శ్రీకృష్ణుడే మూర్తీభవించి కనిపించాడు!" అని వివరించారు.
ప్రముఖ న్యాయవాది అయిన దేశబంధు చిత్తరంజన్ దాస్ ఈ న్యాయవిచారణలో అరబిందో తరుపున వాదించారు.
ఆయన తన వాదనలో, "అరబిందో గతించిన తర్వాత కూడా, చిరకాలం, ఇతడి మాటలు భారతదేశంలోనే కాక యావత్ ప్రపంచంలోనూ మళ్ళీమళ్ళీ ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి!" అని అరబిందోను కీర్తిస్తూ, సమర్థించారు. ఎట్టకేలకు అరబిందో నిర్దోషి అని ప్రకటించి, 6 మే 1909న విడుదల చేశారు.
జైలుజీవితం అరబిందో ఆలోచనాధోరణిలో గొప్ప మార్పును తెచ్చింది. మే నెల 30వ తేదీన ఉత్తరపారా అనే చోట మాట్లాడుతూ, "వాసుదేవుడి దర్శనం నాకు భవిష్యన్మార్గదర్శనం చేసింది."


ఇంతకు ముందు నా దేశ ప్రజల స్వాతంత్ర్యం కోసం పనిచేయమని నాకు ఆదేశం వచ్చింది. కానీ ఇప్పుడు యోగమార్గం ద్వారా మానవాళి ఆధ్యాత్మిక చైతన్యాన్ని మేల్కొల్పమని వాసుదేవుడు నన్ను ఆజ్ఞాపించాడు!" అని చెప్పారు.
ఆ దివ్యదర్శనంలో వాసుదేవుడు ఆయనతో, "నీవు విడుదలైన తర్వాత నీ దేశప్రజలలో ఆధ్యాత్మిక చైతన్యం మేలుకునేలా చెయ్యి.
సనాతన ధర్మం తిరిగి వెలుగొందడానికి, తద్వారా మానవాళి శ్రేయస్సు కోసం నీ దేశప్రజలు నడుము బిగించి పనిచెయ్యాలి.
దీని కోసమే నేను వారికి స్వాతంత్ర్యాన్ని ఇవ్వబోతున్నాను.
భారతదేశం అభివృద్ధి పథంలో సాగినప్పుడు సనాతన ధర్మం ప్రకాశిస్తుంది!" అని చెప్పాడు.
ఈ కార్యసాధన కోసం అరబిందో రెండు పత్రికలను స్థాపించారు.


ఒకటి 'కర్మయోగిన్' అనే పేరుతో ఆంగ్లంలోనూ, రెండవది 'ధర్మ' అనే పేరుతో బెంగాలీ భాషలోనూ ప్రారంభించారు.
ఆ పత్రికల ద్వారా అరబిందో, "తమ ఆత్మగౌరవాన్ని పెంపొందించుకోవడం ద్వారా పరిపూర్ణత సాధించి, యువత భారతదేశపు పునర్నిర్మాణానికి పాటుపడాలి!" అని పిలుపునిచ్చారు.
ఈ ఉన్నతాదర్శ సాధనకోసం దైవం మీద అచంచల విశ్వాసం పెంపొందించుకోవాలని శ్రీఅరబిందో ఉద్బోధించారు.
యువత చేసే త్యాగం వల్లనే పరిపూర్ణమైన ప్రపంచం సృష్టించబడుతుందని ఆయన నమ్మారు.
'ధర్మ' బెంగాలీ పత్రికలో ఈ శక్తిమంతమైన ప్రార్థనను అరబిందో ప్రచురించారు.
"మన జీవితమంతా జగన్మాతకు అవధులులేని ప్రార్థన అగుగాక! రాత్రీపగలు మనం చేసేపనులన్నీ ఆ జగజ్జననికి ప్రేమతో, ఆర్తితో కూడిన నిత్య సేవ అగుగాక. ఓ జగన్మాత! మాతృత్వం దాల్చి ఈ పుణ్యభూమికి అరుగుదెంచుమా!"


అరబిందో జైలులో మగ్గుతున్నందుకు ఆయన భార్య మృణాలిని ఎంతగానో బాధపడింది.
ఆయన రాజకీయ జీవితంవల్ల, మాటిమాటికీ చేసే పర్యటనలవల్ల తరచూ ఆమె నుంచి ఆయన దూరంగా ఉండవలసి వచ్చేది. అయితే వారు అప్పుడప్పుడు ఉత్తరాలు వ్రాసుకునేవారు.
మృణాలిని తన భర్తను దైవంతో సమానంగా భావించేది.
అటువంటి వ్యక్తి నెలల తరబడి జైలులో ఉండడంతో ఆమె పరితాపం పరాకాష్ఠకు చేరుకుంది. ఆమెకు వరుసకు చెల్లెలైన 'సుధీర', ఆమెను రామకృష్ణ మఠానికి తీసుకుని పోయేది.
ఆ మఠంలోని ఆధ్యాత్మిక వాతావరణం ఆమెకు ఎంతగానో సాంత్వనను చేకూర్చేది.
ఒకరోజు మృణాళిని శ్రీరామకృష్ణ పరమహంస ధర్మపత్ని అయిన పవిత్రజనని శ్రీశారదాదేవిని దర్శనం చేసుకుంది.
తన హృదయంలోని బాధను అమ్మకు విప్పిచెప్పుకుంది.



ఆమె దుఃఖమయకథను విన్న శ్రీశారదాదేవి ఒక్క నిముషం ఆలోచించి ఇలా చెప్పారు...
"పుత్రీ! కలతచెందకు. నీ భర్త భగవంతుడి సంరక్షణలో ఉన్నాడు.
శ్రీరామకృష్ణుల దీవెనల వల్ల త్వరలోనే విడుదల అవుతాడు. కానీ అతడికి సాంసారిక జీవితం గడపడం సాధ్యపడదు!"
కరుణతో నిండిన ఈ మాటలు మృణాళినికి ఎంతో ఊరటనిచ్చాయి. ఆమె షిల్లాంగ్‌లో తన తండ్రి దగ్గర నివసించేది.
అక్కడ ఆమె దైవభక్తితో నిండిన ప్రశాంతమైన జీవనాన్ని గడిపింది. కాళికాదేవి, శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీశారదాదేవి, శ్రీఅరబిందో చిత్రపటాలను తన పూజగదిలో ఉంచి, వాటికి పూజ చేసేది.
అక్కడే కూర్చుని తనివితీరా భక్తిగీతాలు ఆలపించేది. ఎట్టకేలకు తన భర్త నిర్దోషిగా విడుదల చేయబడ్డాడన్న వార్త తెలుసుకుని ఆమె ఎంతో సంతోషించింది.


శ్రీఅరబిందో విడుదలయిన తర్వాత ఒక సంవత్సరం పాటు మృణాళినితో కలిసి కలకత్తాలో నివసించారు.
ఈ సమయంలో స్వామి వివేకానంద శిష్యురాలైన సోదరి నివేదిత కలకత్తాలో సంఘసేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నారు.
బ్రిటీష్ ప్రభుత్వం అరబిందోను తిరిగి అరెస్టు చేయాలనే ప్రయత్నంలో ఉన్నదన్న విషయాన్ని సోదరి నివేదిత అరబిందోకు తెలిపారు.
దీనితో అరబిందో కలకత్తా విడిచి చందర్‌నాగోర్ అనే గ్రామానికి వెళ్ళి అక్కడ తన యోగాభ్యాసాన్ని కొనసాగించారు.
ఆ రోజులలో పాండిచ్చేరి ఫ్రెంచివారి పాలనలో ఉండేది. అందుచేత అక్కడ స్థిరపడాలని అరబిందో నిశ్చయించుకున్నారు. చందర్‌నాగోర్‌లో కొన్ని వారాలున్న తర్వాత, మారువేషంలో పాండిచ్చేరికి తన నివాసాన్ని మార్చారు.
తన సహాయకుడైన బిజయ్‌నాగ్‌ని తోడు తీసుకుని, స్టీమరులో ప్రయాణం చేసి 1910 ఏప్రిల్ 4న ఆయన పాండిచ్చేరి చేరుకున్నారు.
ప్రముఖ తమిళ మహాకవి సుబ్రమణ్య భారతి, దేశభక్తుడైన శ్రీనివాస చారియర్ వారికి సాదరంగా ఆహ్వానం పలికారు.


పాండిచ్చేరిలో నివాసమేర్పరచుకున్న తర్వాత కూడా బ్రిటీష్ ప్రభుత్వం ఆయనను అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించింది. అయితే పాండిచ్చేరిలోని ఆయన స్నేహితులు ఆయన సంరక్షణ కోసం చేయవలసినదంతా చేశారు. అందువలన బ్రిటీష్ ప్రభుత్వం ఆటలు సాగలేదు.
ఆయన యువశిష్యులైన బిజయ్, మోని, సౌరీన్ బోస్, నళినీకాంత్ గుప్తా ఆయనను కంటికి రెప్పలాగా కాపాడారు.
అరబిందో పాండిచ్చేరిలో ఉన్నప్పుడు 1914లో ఒక ముఖ్యమైన సంఘటన చోటు చేసుకుంది. ఆధ్యాత్మిక అన్వేషణలో, ఫ్రాన్స్ దేశానికి చెందిన పాల్ రిచర్డ్, మీరా రిచర్డ్ భారతదేశానికి వచ్చి, శ్రీ అరబిందో వద్దకు చేరారు.
తర్వాత కాలంలో అరబిందో ఉద్యమానికి వీరే మార్గదర్శకులయ్యారు. వారిరువురూ అసలైన ఆధ్యాత్మికతను అన్వేషిస్తున్నవారే.
చిన్నతనం నుంచీ మీరా రిచర్డ్‌కు పేదసాదలకు సేవచేయడంలో ఎంతో ఆసక్తి ఉండేది. ఆధ్యాత్మిక విషయాల మీద అనేక పుస్తకాలను చదివింది.
ఆధ్యాత్మిక జీవితం గడపాలనుకునేవారు మానసిక శక్తిని పెంపొందించుకోవడం ఎంతైనా అవసరమని ఆమె గ్రహించింది. ఆమెను అమితంగా ప్రభావితం చేసిన పుస్తకాలలో స్వామి వివేకానంద రచించిన "రాజయోగం" ముఖ్యమైనది.


1914 మే 29న వారు శ్రీ అరబిందోను మొదటిసారి దర్శించారు.
మీరా రిచర్డ్ పారిస్‌లో ఉన్నప్పుడు కలలలో అనేకసార్లు శ్రీకృష్ణభగవానుణ్ణి దర్శించింది. శ్రీఅరబిందోయే శ్రీకృష్ణుడి రూపంలో తనకు దర్శనమిచ్చినట్లు ఆమె ఆ రోజున గ్రహించింది.
శ్రీ అరబిందో భవిష్యత్తులో మానవాళి యొక్క సంరక్షకుడు కాగలడనీ, ఆయనొక భగవదవతారమనీ ఆమెకు దృఢమైన విశ్వాసం కలిగింది.
మరుసటిరోజు ఆమె తన డైరీలో ఇలా వ్రాసుకుంది.
“ఈ భూమి మీద కోట్లాదిమంది జనులు భయంకర అజ్ఞానంలో మునిగిపోయి ఉన్నారనే వాస్తవం ప్రస్తుతం అవాస్తవం.
మేము నిన్న చూసిన మనిషి ఈ భూమి మీదనే ఉన్నాడు. ఈ భూమి మీది అజ్ఞానాంధకారాన్ని పారద్రోలి వెలుగులను నింపే రోజు త్వరలోనే వస్తుందనీ, భగవంతుని సామ్రాజ్యం తిరిగి భూమి మీద స్థాపించబడుతుందనీ చెప్పడానికి ఆయన ఉనికియే ఋజువు!”

వారు ముగ్గురూ కలిసి హిందూమతంతోపాటు మిగిలిన మతాల యొక్క మహత్తర సందేశాన్ని వ్యాప్తి చేయడానికి 'ఆర్య' అనే పేరుతో ఒక పత్రికను ప్రారంభించారు.

మనిషి వ్యక్తిత్వాన్ని పెంపొందించడమే ఈ పత్రిక యొక్క లక్ష్యం.

ఈ పత్రికలో తరచుగా రామకృష్ణ పరమహంస, వివేకానందుల బోధనలు ప్రచురితమయ్యేవి.



అటువంటి వాటిలో శ్రీరామకృష్ణుని ఒక బోధ: "ఎవరైతే ఇతరుల మంచి చెడులను గురించి మాట్లాడుతూ కాలక్షేపం చేస్తారో వాళ్ళు తమ సమయాన్ని వృథా చేసుకుంటున్నారు; ఎందుకంటే వారు తమలోని అంతరాత్మ గురించి గానీ పరమాత్మ గురించి గానీ ఆలోచించడం లేదు కదా!"



అదే విధంగా స్వామి వివేకానంద సూక్తి: "ప్రతీ మనిషిలోనూ ఆత్మశక్తి అంతర్గతంగా ఉంది. దానికి వెలికి తీయడానికి కావల్సిన శక్తిసామర్థ్యాలు తనలో ఉన్నాయి."



మొదటి ప్రపంచ యుద్ధం 1914వ సం॥లో ప్రారంభమైంది.
పాల్, మీరా రిచర్డ్‌లు తప్పనిసరి పరిస్థితులలో ఫ్రాన్స్ తిరిగిపోవలసి వచ్చింది. వాళ్ళు కొద్ది సంవత్సరాలు జపాన్‌లో ఉండి 1920లో తిరిగివచ్చారు.
వారు లేని కాలంలో అరబిందో ఎవరి సాయం లేకుండా, 'ఆర్య' పత్రికను దిగ్విజయంగా నడిపించారు.
వ్యాసాలను ఆయనే సొంతంగా టైపు చేసేవారు. కవిత్వం, తత్త్వశాస్త్రం, మానవాళి సమస్యలు - అనే విషయాల మీద అలుపెరుగకుండా వ్యాసాలు వ్రాసేవారు.
ఈ వ్యాసాలన్నీ తరువాత కాలంలో పుస్తకాలుగా ప్రచురితమై బహుళ ప్రజాదరణను పొందాయి.
మనిషి దైవత్వాన్ని సాధించగలడని తన వ్యాసాల ద్వారా అరబిందో బోధించారు. దీనిని సాధించడానికి యోగమార్గం ద్వారా మనిషి అజ్ఞానాన్నీ, దుర్మార్గాన్నీ వదలించుకోవాలి.


తనలోని అజ్ఞానం నాశనమైనప్పుడు మనిషి జ్ఞానోదయాన్ని పొందుతాడు. ఆ విధంగా పరిపూర్ణతను సాధిస్తాడు.
వి.చంద్రశేఖరమ్, కపాలి శాస్త్రి, దిలీప్‌కుమార్ రాయ్ వంటి అనేక మంది యోగమార్గాన్ని అన్వేషించేందుకు ఇటువంటి వ్యాసాలు పురికొల్పాయి.
కర్మయోగం, రాజయోగం, జ్ఞానయోగం, తంత్రయోగం, భక్తియోగం - అన్నీ ఒకే గమ్యాన్ని చేరుస్తాయని అరబిందో బోధించారు.
భక్తియోగాన్ని సమర్థిస్తూ, "భగవంతుణ్ణి మానవరూపంలో చూడాలనుకునే ఈ మార్గాన్ని తృణీకరించడం ఎంతమాత్రం సబబు కాదు!" అని ప్రకటించారు.
"ఆయనే విష్ణువుగా, ఆయనే కృష్ణుడుగా, ఆయనే కాళీమాతగానూ కనిపిస్తారు. పైగా ఆయనే బుద్ధుడు, క్రీస్తు మొదలైన మానవరూపాలలో కూడా కనిపిస్తాడు!" అని భగవంతుడి యొక్క వివిధ రూపాలకు వివరణ ఇచ్చారు.


భారతీయ సంస్కృతికి చెందిన దేవీదేవతలలో అరబిందో హృదయానికి నచ్చే దేవతలు కాళీ, కృష్ణుడు.
తన దేశ ప్రజలకు శక్తినీ, స్వాతంత్ర్యాన్నీ ఇమ్మని కోరుతూ ఆయనొక అద్భుతమైన కవితను వ్రాశారు...
దుర్గామాతా! సింహవాహినీ! శక్తిప్రదాతా! శంభుమోహినీ! నీదు శక్తికే 'అంశల'మమ్మా! భారత యువతగ పుట్టితిమమ్మా! నీ గుడిలో గుమిగూడితిమమ్మా! నీవే ఈ ధరణిని అవతరించుమా! భారత భువికే అరుగుదెంచుమా!
శ్రీకృష్ణుడి వ్యక్తిత్వం అరబిందోను ఎంతగానో ఆకర్షించింది. 'కృష్ణభక్తి' ఆయన జీవితంలో ఒక విడదీయలేని భాగంగా మారిపోయింది.
ఆయన రచనలన్నింటిలోనూ అది కనిపించేది. కవితలతోపాటు ఆయన భగవద్గీత మీద అనేక వ్యాసాలను రచించారు.
వాటిని, "భగవద్గీత మీద వ్యాసాలు" అన్న పేరుతో ప్రచురించారు. ఆయన ఉద్దేశ్యంలో కృష్ణుడి బోధనల సారం 'వైరాగ్యమే'.


అరబిందో, "ఆ పార్థసారథి మన హృదయసారథి కూడా!
మనల్ని మనం ఆయనకు పూర్తిగా సమర్పించుకుంటే ఆయనే మన జీవితాలను ముందుకు నడిపే బాధ్యతను చేపడతాడు. ఆయన మన పనులను నిర్దేశిస్తున్నట్లయితే మనం ఎల్లప్పుడూ సక్రమంగానే పనిచేస్తాము!" అని బోధించారు.
పాండిచ్చేరి వచ్చిన తొలిరోజుల్లో అరబిందో భారతీయ చిత్రకళ, భవననిర్మాణకళ, రాజనీతి మొదలైన విషయాలమీద వ్యాసాలు వ్రాసేవారు.
ఆపైన భారతీయ సంస్కృతికి మూలస్తంభాలైన వేదాలు, రామాయణం, మహాభారతం మొదలైన విషయాలమీద కూడా వ్రాశారు.
ఓం
బెంగాలీ భాషలోనుంచి అనేక కవితలను ఆంగ్లంలోకి తర్జుమా చేశారు. 'విద్యాపతి' అనే కవి కృష్ణభక్తిమీద రచించిన పాటలకు అరబిందో ఎంతో అందమైన అనువాదాలను అందించారు.


మొదటి ప్రపంచ యుద్ధం 1918లో ముగిసింది. జపాన్ నుంచి 1920లో మీరా రిచర్డ్ భారతదేశానికి తిరిగివచ్చి పాండిచ్చేరిలో శాశ్వతంగా నివాసం ఏర్పరచుకోవడానికి నిశ్చయించుకున్నారు.
అప్పటికే చాలామంది విశ్వాసపాత్రులైన శిష్యులు అరబిందో వద్ద ఉన్నారు.
మీరా రిచర్డ్ ఎంతో జాగ్రత్తగా, నేర్పుతో వారందరి జీవితాలను ఒకే త్రాటిపైకి తెచ్చింది. ఆమె యొక్క అవిశ్రాంత ప్రయత్నం వల్లనే "అరబిందో ఆశ్రమ్" ఏర్పాటయింది.
ప్రతిరోజూ అరబిందో కొంతసేపు తన యువశిష్యులతో గడుపుతూ వారికి యోగమార్గంలో శిక్షణ ఇచ్చేవారు. దానితోపాటు సాహిత్యం, తత్త్వశాస్త్రం, జీవితంలోని సమస్యలను ఎదుర్కోవడం ఎలా, అన్న విషయాల మీద వారు చర్చించేవారు.
అరబిందో తన యోగసాధనను కొనసాగించారు. ఆయన లక్ష్యం ఆధ్యాత్మికమైన జ్ఞానోదయాన్ని పొందడమే కాక శరీరాన్ని బలంగా ఉంచుకోవడం కూడా.
ఇందుకోసం శరీరం లోపలే కాక శరీరం బయట కూడా సాధన చేయడం ఎంతైనా అవసరం. అనేకమంది శిష్యులు వచ్చి చేరడంతో అరబిందో ఆశ్రమ ఖ్యాతి నలువైపులకూ ప్రాకింది.


అరబిందో పాండిచ్చేరిలో ఉన్నప్పుడు ఆయన భార్య మృణాళిని బెంగాల్‌లోనే ఉండిపోయింది. కానీ ఆయన ఆమెను మరచిపోలేదు. వారిరువురూ ఉత్తరప్రత్యుత్తరాల ద్వారా ఒకరి విషయాలను ఒకరికి తెలుపుకునేవారు.
మృణాళిని తపోమయ జీవితం గడుపుతూ తన భర్తను చేరే రోజు కోసం ఎదురు చూడసాగింది.
ఆమె శ్రీరామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద సాహిత్యాన్ని చదువుతూ, 'రవీంద్ర సంగీతాన్ని' గానం చేస్తూ కాలం గడపసాగింది.
మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత తన వద్దకు రమ్మని అరబిందో మృణాళినికి వ్రాశారు. ఈ వార్త ఆమె కుటుంబంలోని వారందరినీ ఆనందంతో నింపింది. దూరప్రాంతమైన దక్షిణ భారతదేశానికి ప్రయాణం కోసం మృణాళిని తండ్రి ఏర్పాట్లు చేయసాగారు.
అయితే మృణాళినికి 'ఇన్‌ఫ్లుయంజా' జబ్బుసోకి 1918 డిసెంబరు 17న కన్నుమూసింది.
మృణాళిని తల్లి ఎంతో దుఃఖంతో ఓదార్పు కోసం శారదాదేవి దగ్గరకు వెళ్ళింది.


శ్రీ శారదాదేవి ఆమెను ఓదారుస్తూ...
“నేనొక దివ్యదృశ్యాన్ని చూశాను. దానిలో ‘నా కోడలు’ మృణాళిని నాకు కనిపించింది.
శాపగ్రస్తురాలైన ఒక దేవత మీకు కూతురుగా మృణాళిని రూపంలో జన్మించింది. ఇప్పుడు ఆమె ప్రారబ్ధకర్మ ముగియడంతో ఆమె ఆత్మ వెళ్ళిపోయింది!”
మృణాళిని మరణంతో అరబిందో ఎంతో దుఃఖించారు. అయినా తాను చేస్తున్న కార్యాన్ని ఆపలేదు. మరింతగా యోగసాధనలో మునిగిపోయారు.
1926 నవంబరు 24న శ్రీకృష్ణుని మహోజ్జ్వల రూపం ఆయనకు దర్శనమయ్యింది. దీనిని యోగమార్గంలో ‘సిద్ధి’ అని పేర్కొంటారు.
దీనితో ఆయన బయటకు రావడం మానివేశారు. ఆయనకు అత్యంత సన్నిహితులైన అనుయాయులు మాత్రమే ఆయన దగ్గరకు వెళ్ళేవారు. అయితే, ఇలా ఉన్నప్పటికీ ఆయన జీవితానికి, యోగసాధనకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చేవారు.
తన శిష్యుల ప్రశ్నలకు సమాధానాలుగా ఆయన వ్రాసిన ఉత్తరాలు యోగసాధనమీద ఒక అద్భుతమైన కరదీపికగా గ్రంథరూపంలో ప్రచురితమయ్యాయి.


అప్పటికి మీరా రిచర్డ్ కూడా యోగమార్గంలో గొప్ప పరిణతి సాధించారు.
ఇక మీరా రిచర్డ్ తానే మార్గదర్శక బాధ్యతలను చేపట్టి ఆశ్రమం దైనందిన కార్యకలాపాలను నడుపసాగారు. ఆమెను ఆశ్రమవాసులందరూ 'మదర్' (శ్రీమాత) అని వ్యవహరించేవారు. భక్తులు అరబిందో దర్శనాన్ని కోరుతుండడంతో కొన్ని ప్రత్యేకమైన రోజులలో ఆయన దర్శనం ఏర్పాటు చేసేవారు.
ఆయన పుట్టినరోజు ఆగస్ట్ 15న, ఆయన సిద్ధి పొందిన రోజు నవంబరు 24న, 'శ్రీమాత' పుట్టిన రోజు ఫిబ్రవరి 21న ఈ దర్శనాలు ఏర్పాటు చేసేవారు.
ఈ దినాలలో అరబిందో, శ్రీమాతలను భక్తులు దర్శించి ఎంతో ఆనందంతో, నిశ్శబ్దంగా వారి ఆశీస్సులు పొందేవారు.
మహాభారతంలోని సావిత్రి పాత్ర అంటే అరబిందోకు ఎంతో ఇష్టం.
ఆయన ఏకాంతంగా గడిపిన సంవత్సరాలలో ఆయన సావిత్రి మీద ఒక బృహత్కావ్యాన్ని రచించారు.



సావిత్రి కథ ఏమిటంటే:
అశ్వపతి అనే రాజు కుమార్తె సావిత్రి. ఆమె గొప్ప సౌందర్యవతి మాత్రమే కాక ధర్మశాస్త్రాలను చక్కగా చదివింది.
వివాహం చేసుకునే వయస్సు వచ్చాక తన భర్తను తానే ఎంచుకుందామని ఆమె నిశ్చయించుకుంది. ఆమె తండ్రి అందుకు అంగీకరించి చుట్టుప్రక్కల ఉన్న రాజ్యాలనన్నింటినీ చూపించడానికి వీలుగా ప్రయాణం ఏర్పాట్లు చేశాడు.
ఆమె ఎన్నో రాజ్యాలు తిరిగినా తనకు నచ్చిన భర్తను ఎంచుకోలేక పోయింది.
వారు అడవిలో ప్రయాణం చేస్తుండగా అక్కడ సత్యవంతుడనే అందమైన యువకుణ్ణి చూసి మొదటిచూపులోనే అతణ్ణి తన భర్తగా వరించింది.
అతడెవరో విచారించగా, రాజ్యాన్ని కోల్పోయి, అడవిలో కాలం గడుపుతున్న ఒక రాజు యొక్క కుమారుడని వారికి తెలిసింది.
అయితే నారదమహర్షి వచ్చి సత్యవంతుడు దురదృష్టజాతకుడనీ, వారి వివాహం జరిగిన సంవత్సరకాలానికి అతడు మరణిస్తాడనీ చెప్పాడు.

అయితే సావిత్రి ధైర్యవంతురాలు, ఆధ్యాత్మిక జ్ఞానం కలిగినది. ఆమె తన మనస్సులో సత్యవంతుడినే పెళ్ళాడతానని దృఢంగా నిశ్చయించుకుంది.
ఆమె తన తండ్రితో, "ఒక స్త్రీ ఒక పురుషుడికి తన హృదయాన్ని ఇచ్చిన తర్వాత, దాన్ని వెనక్కి తీసుకుని వేరొకరికి ఇవ్వడం సాధ్యం కాదు!" అని చెప్పింది.
అలా సావిత్రి తన తల్లిదండ్రులను ఒప్పించడంతో ఆ వివాహం జరిగింది.
సావిత్రి సత్యవంతుడితో, అత్తమామలతో అడవిలో జీవించసాగింది. ఇక సావిత్రి భయపడుతున్న రోజు రానే వచ్చింది. ఆ రోజు సావిత్రి సత్యవంతుడి వెంట అడవికి వెళ్ళింది. కట్టెలు కొట్టడం పూర్తి చేసిన తర్వాత కళ్ళు తిరుగుతున్నాయంటూ సత్యవంతుడు సావిత్రి ఒడిలో పడుకుని, అక్కడే ప్రాణాలు విడిచిపెట్టాడు.
ఆ దంపతులు ఆధ్యాత్మికంగా ఎంతో పురోగతి సాధించినందువలన, యమధర్మరాజు తానే స్వయంగా వచ్చి సత్యవంతుడి ప్రాణాలను తీసుకుని తిరిగి యమపురికి బయలుదేరాడు.
అతణ్ణి పునర్జీవితుడిగా చేయాలన్న దృఢసంకల్పంతో, సావిత్రి యముణ్ణి అనుసరించింది.
తన తెలివితేటలతో అతణ్ణి మెప్పించి సత్యవంతుడి ప్రాణాలను తిరిగి పొందింది. సావిత్రీసత్యవంతులు చిరకాలం సుఖంగా జీవించారు.


ఆ మహత్కథను శ్రీఅరబిందో 'సావిత్రి' అనే పేరుతో పద్యకావ్యంగా రచించారు. ఈ కావ్యం ప్రపంచఖ్యాతి పొందింది.
ఈ కావ్యంలో ఒక గొప్ప యోగినిగా సావిత్రి చేసిన సాధనలను శ్రీఅరబిందో వివరించారు.
సత్యవంతుడి పట్ల ఆమెకున్న నిష్కల్మషమైన ప్రేమ, మృత్యువునే ముఖాముఖీ ఎదుర్కోగలిగే గొప్ప శక్తిని ఆమెకు ఇచ్చింది. పట్టుదల గల మనిషి జీవితంలో ఏమి సాధించగలడో ఈ గొప్ప పుస్తకం చక్కగా వివరిస్తుంది.
శ్రీఅరబిందో 5 డిసెంబరు 1950న మహాసమాధి చెందారు. ఆయన పార్థివశరీరం ఒక విధమైన యోగకాంతిని వెదజల్లుతూ ఉంది. ఆయనను చూడడానికి ప్రపంచం నలుమూలల నుంచీ భక్తులు వచ్చారు.
ఆయన శరీరాన్ని నాలుగు రోజులపాటు దర్శనానికి ఉంచి 1950 డిసెంబరు 9న ఆశ్రమంలో ఖననం చేశారు.
సంస్కృతి, మతం, ఆధ్యాత్మికతలను తెలుసుకోవాలనే వారందరికీ, పాండిచ్చేరిలోని ఈ 'అరబిందో ఆశ్రమం' ఒక తీర్థయాత్రాస్థలంగా ఈనాడు విరాజిల్లుతోంది.